ప్రజాశక్తి
సోమవారం 18 నవంబర్ 2024



కోడూరు తీరంలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

పర్యాటకుల రాకపోకలతో మండలంలోని కోడూరు సముద్ర తీరంలో సందడి నెలకొంది. ప్రతి ఆదివారం, పండుగ రోజుల్లో, సెలవు దినాల్లో కోడూరు సాగర తీరం పర్యాటకుల రాక పోకలతో కళకళలాడుతూ దర్శనమిస్తుంది. పర్యాటకులను ఆకర్షించే విషయంలో జిల్లాలో మైపాడు బీచ్ తర్వాతి స్థానాన్ని కోడూరు తీరం ఆక్రమించింది. సహజ సిద్ధమైన ఇసుక తిన్నెలతో కోడూరు తీరం అందాలను సంతరించుకొని పర్యటకులకు కను విందు చేస్తుంది. ఎటువంటి అవాంఛనియ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ వీరేంద్ర బాబు ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశారు.

వంట 'ఇంట'.. నూనె 'మంట'..!

- రెండు నెలల్లో కిలో రూ.40 పెంపు
- ప్రతి నెలా రెండు సార్లు పెరుగుదల
- కేంద్రం 24 శాతం ఎక్సైజ్ డ్యూటీ

కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా దేశంలో భారీగా వంట నూనె ధరలు పెరుగుతున్నాయి. ఒకేసారి 24 శాతం ఎక్సైజ్‌డ్యూటీ పెంచడంతో నూనె ధరలు అడ్డు అదుపు లేకుండా పెరుగుతూనే ఉన్నాయి. కేవలం రెండు నెలల కాలంలో కిలో రూ. 40 వరకు పెరిగినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ప్రతి 15 రోజులకు ఒకసారి టారీఫ్‌లు పెంచుకుంటూ పోతోంది.. ఫలితంగా ధరలు పెరుగుతున్నాయి. యుద్ధం నేపథ్యంలో విదేశాల నుంచి రావాల్సిన ముడి చమురు దిగుమతులు తగ్గడం కూడా ఒక కారణంగా తెలుస్తోంది. ఈనెల 15న మరోసారి నూనె ధరలు స్వల్పంగా పెరిగాయి. ఇది ఇలానే కొనసాగితే మరి కొద్ది రోజుల్లో కిలో వంటనూనె రూ. 200 మార్కుదాటినా ఆశ్చర్యం లేదని తెలుస్తోంది.

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం వంటింట మహిళలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఎన్నికల తర్వాత నిత్యవసర ధరలు నియంత్రణలో లేకుండా పోయాయి. పప్పులు, నూనె, బియ్యం ఒక్కటేమిటి ప్రతి వస్తువు ధరలు రోజు రోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇందులో ప్రధానంగా వంట నూనె ధరలకు రెక్కలొచ్చాయి. మార్చి మాసంలో కిలో పామాయిల్ రూ. 90 , సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ. 105 ఉండేది. ప్రస్తుతం కిలో పామాయిల్ రూ.137, సన్‌ఫ్లవర్ ఆయిల్ కిలో రూ. 145కు పెరిగింది. కేంద్ర ప్రభుత్వం మలేషియా నూనె ధరల ప్రకారం ధరల మార్కెట్ టారీఫ్ ప్రకటిస్తోంది. ప్రతి 15 రోజుల ఒకసారి టారీఫ్‌ను కేంద్రం ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల పామాయిల్‌పై కిలో రూ 18, సన్‌ఫ్లవర్ ఆయిల్ కిలో రూ 30 పెంచారు. మళ్లీ రెండు నూనెలతో రూ. 10 పెంచింది. 15న టారీఫ్ ధరలతో కొంత పెరుగుదల కనిపిస్తోంది. యుద్ధం నేపథ్యంలో విదేశాల నుంచి ఇక్కడకు దిగుమతి కావాల్సిన ముడినూనె తక్కువగా వస్తోంది. మలేషియా నుంచి నూనె ముడుసరుకు నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరుకు అధిక సంఖ్యలో వస్తున్నాయి. ముత్తుకూరు మండలం పంటపాళెం వద్ద ఎనిమిది పామాయిల్ పరిశ్రమలున్నాయి. విదేశాల నుంచి ఓడల ద్వారా ఇక్కడకు ముడి సరుకు వస్తోంది. అక్కడ నుంచి పైప్‌లైన్ ద్వారా ఫ్యాక్టరీలకు వచ్చి అక్కడ నుంచి ప్యాకెట్లు, డబ్బాల్లో తమిళనాడు, కర్నాటక, తెలంగాణా, ఎపి రాష్ట్రాలకు పంపిణి చేస్తారు. ప్రతి రోజు సుమారు వందలారీలు ఇక్కడ నుంచి ఇతర రాష్ట్రాలకు వెళుతున్నాయి. యుద్ధం నేపథ్యంలో ఓడల్లో నూనె ముడిసరుకులు తక్కువగా వస్తున్నట్లు తెలుస్తోంది. మలేషియా నుంచి వచ్చే ఒక్కో ఓడ కేవలం సరుకు ధర సుమారు రూ 700 నుంచి 800 కోట్లు ఉంటుంది. దీనికి ఇన్సూరెన్స్ చేస్తారు. ఒక వేళ ఏదైనా ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ వస్తుందని ఆయా కంపెనీల యజమానులు భావిస్తుంటాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ఇన్సూరెన్స్ కంపెనీలు ఓడలకు ఇన్సూరెన్స్ చేయడం లేదని సమాచారం. యుద్ధంలో ఏ బాంబు ఎక్కడ పడుతుంది. ఏ ఓడకు నష్టం జరుగుతుందో తెలియక ఇన్సూరెన్స్ కంపెనీలు ఇన్సూరెన్స్ చేయడానికి ముందుకు కావడం లేదు. ఓడకు ఇన్సూరెన్స్ ఉన్నప్పటికీ అందులోని ముడిసరుకులకు ఇవ్వడం లేదని తెలిసింది. అందుకే వ్యాపారులు ఎక్కువ మంది దిగుమతులకు దూరంగా ఉన్నారనే సమాచారం . కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ ఇటీవల 24 శాతం పెంచారు. ఫలితంగా నూనె ధరలు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు ఇంత భారీస్థాయిలో నూనె ధరలు పెరగలేదని వ్యాపారులు చెబుతున్నారు. వంట నూనె ధరలు ఫలితంగా టిఫిన్, బోజనాలు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ ధరలు భారీగా పెరిగాయి. కుటుంబాల్లో మహిళలు నూనె ధరలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వంట ఇళ్లల్లో నూనె మంటలు రగులుతున్నాయి. ప్రభుత్వం నూనె ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సన్మానిస్తున్న దృశ్యం

భానుమూర్తికి సన్మానం

ప్రజాశక్తి-నెల్లూరు :ఎపి హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీస్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా పనిచేస్తున్న మలినేని భానుమూర్తి తిరుపతి జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారిగా ఉద్యోగన్నతి పొందిన సందర్భాన్ని పురస్కరించుకోని ఆ సంఘం నాయకులు సన్మానించారు. ఆదివారం నగరంలోని ఓ ప్రయివేట్ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్టేట్ హెల్త్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ చేజర్ల సుధాకర్ రావు ,పలు ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొని ఘనంగా సత్కరించారు. ఉద్యోగ సంఘ నాయకులు బాలు, మల్లికార్జున, ఝాన్సీ లక్ష్మి ఆంధ్రప్రదేశ్ స్టేట్ హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీస్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ హరి ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ సునీత, జిల్లా నాయకులు అశోక్, ఉమర్, ఆరోగ్య మేరీ , బీబ్ జాన్, రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలు

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం వైభవంగా ఆదివారం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు కార్తీక వనభోజనం నిర్వహించారు. కార్తీక వనభోజన కార్యక్రమంలో మాల ధారణ భక్తులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి-కందుకూరు :ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని డిఎస్‌పి బాలసుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం పట్టణంలోని వివిధ వ్యాపార సంస్థల యాజమాన్యాలతో డిఎస్‌పి బాలసుబ్రమణ్యం తన ఛాంబర్‌లో సమావేశ మయ్యారు. ఆయన మాట్లాడుతూ కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యల గురించి వివరించారు. పట్టణంలోని వివిధ వ్యాపార సంస్థల యాజమాన్యులు తాము సూచించిన సూచనలు పాటిస్తే పట్టణంలోని ట్రాఫిక్ సమస్య తలెత్తదన్నారు. డీఎస్పీ పట్టణంలో షాపులు, గోడౌన్లలో వివిధ వస్తువులు వాహనాల ద్వారా లోడ్, అన్లోడ్ చేసుకునేవారు ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల్లోపు రాత్రి 9 గంటల తర్వాత చేసుకోవాలన్నారు. ప్రతి షాపు యజమాని వారి షాపు ముందు ఉన్న ఫుట్ పాత్ కి రోలింగ్ వేయించుకొని తగిన వైట్ లైన్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. మోటార్ బైకులు సదరు ప్రాంతంలో పార్కింగ్ చేసేలా చూసుకోవాలన్నారు.. కొంతమంది షాపు యజమానులు వారి షాపు ముందు ఉన్న ఫుట్పాత్ , రోడ్డు భాగంలో తోపుడు బండ్లు, ఇతర చిరు వ్యాపారస్తుల నిర్వహణకు అద్దెకు ఇచ్చి వారి నుంచి వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటివారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. కందుకూరు సిఐ వెంకటేశ్వరరావు, కందుకూరు పట్టణ ఎస్సై సాంబశివయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి

కండక్టర్‌పై దాడి హేయం : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు ఆర్‌టిసి డిపోలో పనిచేస్తున్న మహిళా కండక్టర్ సుహాసినిపై జరిగిన దాడిని కందుకూరు ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో కమిటీ డిమాండ్ ఖండించింది. ఈ మేరకు కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కందుకూరు ఆర్‌టిసి డిపో మహిళా కండక్టర్ సుహాసినిని ఎస్‌డబ్ల్యుఎఫ్ (సిఐటియు)డిపో కమిటీ నాయకత్వం ఆదివారం పరామర్శించింది. ఆర్‌టిసిలో పనిచేస్తున్న ఉద్యోగస్తులపై ప్రత్యేకంగా మహిళలపై దాడి జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆర్‌టిసి యాజమాన్యం మీద ఉన్నదన్ నాయకులు అన్నారు. పరామర్శించిన వారిలో డిపో కార్యదర్శి డి రమణయ్య, డిపో ఉపాధ్యక్షులు డి మాల కొండయ్య, ప్రచారర్శి కెఎస్ రావు,ఎంకే రావు, ఆర్ టిసి యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు నాయకులు ఎస్ఎ గౌస్ వున్నారు.

కండక్టర్ సుభాషినిని పరామర్శిస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ

భవన నిర్మాణ కార్మిక సంఘం
నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక 3వ డివిజన్ కిసాన్ నగర్ మల్లి తోట ప్రాంతంలో భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో 24 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా మన్నేపల్లి శీనయ్య ,అధ్యక్షులు ఎన్ వెంకట్రావు, కార్యదర్శి ఎం వెంకట కష్ణయ్య, ట్రెజరీ వి సుధాకర్ ఎన్నికైనట్లు ప్రకటించారు.ఈ సమావేశానికి భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, అధ్యక్షులు పెంచలయ్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సంపూర్ణమ్మ, ఆఫీస్ బేరర్స్ ఎం చిరంజీవి, జె చిరంజీవి పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-నెల్లూరు :ప్రజల వద్దకు పరిపాలనను మరింత చేరువ చేసే ప్రయత్నంలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని వికేంద్రీకరణ చేస్తున్నట్లు కలెక్టర్ ఓ. ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు.నేటి నుండి మున్సిపల్ కార్యాలయాల్లో, మండల కేంద్ర కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కొరకు వారికి చేరువలోని మండల కార్యాలయాల్లో అర్జీలు సమర్పిం చవచ్చునన్నారు.

'ఎఫ్ఆర్ఎస్' వేతనంతో కలపడం సరికాదు..

ప్రజాశక్తి-నెల్లూరు :ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల వేతనాలు ఎఫ్ ఆర్ ఎస్ తో లింక్ చేయడం సరికాదని, ఎఫ్ ఆర్ ఎస్ లో ఉన్న సాంకేతిక లోపాలను సవరించిన తర్వాత మాత్రమే శాలరీస్ తో లింక్ చేయాలని ఎపి ఎన్ హెచ్ ఎం జెఎసి చైర్మన్ దయామని, కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని జిజిహెచ్‌లో జిల్లా ఎన్‌హెచ్ఎం జెఎసి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అతి తక్కువ వేతనాలు తీసుకుంటున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు ప్రభుత్వం అవలంభిస్తున్న ఈ విధానం ద్వారా నష్టపోతారన్నారు. వేతనాలు కట్ చేయాలి అని నిర్ణయించిన అధికారులు ఎన్ హెచ్ ఉద్యోగుల వేతన పెంపు కోసం ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. చివరగా నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా జేఏసి కార్యవర్గ అధ్యక్షులుగా జీవానందం, కన్వీనర్‌గా అబ్దుల్ రజాక్, కోశాధికారిగా ప్రసన్నకుమారి, ప్రవీణ్‌బాబి, లక్ష్మీప్రసన్న రాజ్యం, రాజేష్, మునెమ్మ, సత్యప్రియ, మైలిం భాషలను కార్యవర్గ సభ్యులుగా ప్రకటించారు. ఆయుష్, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్ ల్యాబ్ టెక్నీషియన్స్ ఉన్నారు.

రాళ్లపాడు ప్రాజెక్టు

పెరిగిన 'రాళ్లపాడు' నీటిమట్టం

ప్రజాశక్తి - లింగసముద్రం :రాళ్లపాడు ప్రాజెక్టు నీటిమట్టం 17.7అడుగులకు చేరింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుండి నీటి ప్రవాహంతో పాటు సోమశిల ప్రాజెక్టు నుండి నీరు ప్రాజెక్టులోకి రావడంతో ఆదివారం సాయంత్రానికి నీటిమట్టం 17.7అడుగులకు పెరిగిందని ప్రాజెక్ట్ అధికారులు చెప్పారు.ఎగువ ప్రాంతంలో వర్షాలు పడితే నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

తగ్గిన ఇసుక ధరలు

హర్షం వ్యక్తం చేస్తున్న భవన నిర్మాణదారులు - ట్రాక్టర్ ఇసుక రూ. 1,600

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు ప్రాంతంలో ఇసుక ధరలు భారీగా తగ్గాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇసుక ధరలు తగ్గుముఖం పట్టాయి. ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తానని ప్రకటించడంతో ఎన్నికల ముగిసి ఫలితాలు వచ్చిన వెంటనే కందుకూరు ప్రాంతంలో ఇసుక ధరలు తగ్గించి ట్రాక్టర్ యజమానులు సరఫరా చేయడం ప్రారంభించారు. అయితే అధికార పార్టీ నాయకులు అందరిని ఇసుక తోలుకునే అవకాశం ఇవ్వకపోవడంతో ధరలు కొద్దిగా ఎక్కువగానే ఉంటూ వచ్చాయి .ప్రభుత్వం ఉచిత ఇసుక ప్రకటన చేయగానే ఓ ట్రాక్టర్ ఇసుక కందుకూరు ప్రాంతంలో కొంచె దగ్గరగా ఉన్నవారికి రూ. 1600కు సరఫరా చేస్తున్నారు. కొంచె దూరం ఉన్నవారికి రూ. 2000 కి సరఫరా చేస్తున్నారు. నదులు ఉండే ప్రాంతంలోని గ్రామాల్లో ఉన్న ట్రాక్టర్ యజమానులు మాత్రమే ఇసుక తెచ్చి అమ్ముకునే అవకాశం ప్రస్తుతం కలుగుతోంది. ఎవరంటే వాళ్ళ వెళ్లి ఇసుక తెచ్చుకునే పరిస్థితి లేకుండా అడ్డుకుంటున్నారు. నదీ పరివాహక ప్రాంత గ్రామాల్లోని వారు మాత్రమే, అధికా పార్టీవారు ఇసుక తెచ్చి భవనాలు నిర్మించుకునే వారికి ఇక్కడ ఇస్తున్నారు. ఎలా ఎక్కడ ఇచ్చినా ఇసుక ధరలు వినియోగదారులకి అందుబాటులోకి వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో ఒక ట్రాక్టర్ ఇసుక రూ.5 వేలకు విక్రయాలు జరిగాయి. వైసికి చెందిన కొందరు నేతలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొనే రూ. కోట్ల సంపాదించారు. రూ. 5 వేలు పెట్టిన ఇసుక దొరకని పరిస్థితి కందుకూరు ప్రాంతంలో ఉంటూ వచ్చింది. అనేక సార్లు ట్రాక్టర్లు పట్టుకొని పోలీసులు కేసులు నమోదు చేశారు.ట్రాక్టర్ యజమానుల వద్ద లంచాలు పెద్ద ఎత్తున గుంజుకున్నారు. డబ్బులు ఎంత పెట్టినా ఇసుక దొరకని పరిస్థితి కందుకూరు ప్రాంతాల్లో అప్పటిలో ఉంది. దీంతో నెల్లూరు నుంచి ఇసుక కందుకూరు తెచ్చి అమ్మడం జరిగింది. ఈ విధంగా నెల్లూరు నుంచి ఇసుక తెచ్చి కందుకూరులో అమ్మి ఓ వ్యక్తి కోట్లు సంపాదించాడంటే వ్యాపారం ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. కందుకూరుకు సమీపంలోనే అనేక నదులు ఉన్న గత ప్రభుత్వ హయంలో ఇసుక కరువైంది. భవన యజమానులు ఇసుక కోసం తీవ్రంగా ఇబ్బందులుపడ్డారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కందుకూరు ప్రాంతంలో లేదు. రూ. 2000లకు ఎన్ని ట్రాక్టర్లు కావాలంటే అన్ని ట్రాక్టర్లు తెచ్చి అమ్ముతున్నారు. దీంతో ప్రజలు ఇసుక బాధలు తీరాయనే ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడాకారుడికి బూట్లు బహూకరిస్తున్న మహేష్

బూట్లు బహూకరణ

ప్రజాశక్తి-కందుకూరు

ఎంఎస్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆ ట్రస్ట్ చైర్మన్ న్యాయవాది మాదాల మనోజ్ కుమార్ ఆదివారం యువ అథ్లెటిక్ ముప్పరాజు మహేష్ కు రూ. 8 వేల విలువైన బూట్లను బహూకరించారు. మహేష్ మాట్లాడుతూ తాను కావలి జవహర్ భారతి కళాశాలలో బిఎ మూడో సంవత్సరం చదువుతున్నానన్నారు. ఇప్పటికీ రెండు సార్లు 800 మీటర్ల రన్నింగ్‌లో విక్రమ సింహపురి యూనివర్సిటీ చాంపియన్‌గా నిలిచానన్నారు. పదో తరగతి పొన్నలూరు మండలం ముండ్లమూరి వారి పాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పుడు రన్నింగ్ రేసులో ప్రకాశం జిల్లాలో గోల్డ్ మెడల్ సాధించానని తెలిపారు. ఇప్పుడు 800 మీటర్ల తోపాటుగా 1500 మీటర్ల రన్నింగ్ అథ్లెటిక్స్ లో పాల్గొంటున్నానని తెలిపారు. తన రన్నింగ్‌కు అవసరమైన ఖరీదైన బూట్లు కొనుక్కునే స్థోమత లేకపోవడంతో కందుకూరులోని చక్కా వెంకట కేశవరావు ద్వారా విషయం తెలుసుకున్న ఎంఎస్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మాదాల మనోజ్ తనకు బూట్లు కొనివ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అథ్లెటిక్స్‌లో పథకం సాధించి వారి సహాయానికి ఫలితం చూపిస్తానని మహేష్ తెలిపారు. తనకి రూ. 8 వేలు విలువైన బూట్లను తీసి ఇచ్చినందుకు మాదాల మనోజ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు పద్యాలు ,జానపద గేయాలు పోటీలు నిర్వహించారు. తొలుత చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. తదుపరి పోటీలు ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హిందీ పండిట్ సిహెచ్ సుబ్బారావు,తెలుగు పండిట్ హీరోస్ పాల్గొన్నారు. సుబ్బారావు ఇద్దరు విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వం ఇప్పించారు. గ్రంథ పాలకురాలు పి నాగరాజుని పాల్గొన్నారు.

ఉలవపాడు : మండల కేంద్రమైన ఉలవపాడు లోని శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పాఠశాల విద్యార్థులకు పాటలు పోటీలు నిర్వహించినట్లు గ్రంథ పాలకుడు డి.కోటేశ్వరావు తెలిపారు. ఈ వివిధ పాఠశాల చెందిన 45 మంది విద్యార్థులు పాటల పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణయతగా గా భారతీయ స్టేట్ బ్యాంక్ రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ వి బాల కోటయ్య వ్యవహరించారు. ప్రతిరోజు జరిగే పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 20న వారోత్సవాలు ముగింపు రోజున బహుమతులు అందజేస్తారు అని ఆయన పేర్కొన్నారు.

కందుకూరులో..

సర్వాంగసుందరంగా గణేష్ ఘాట్

ప్రజాశక్తి-నెల్లూరు :నెల్లూరు చెరువు సమీపంలోని స్వర్ణలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణంతో గణేష్ ఘాట్ శోభాయమానంగా వెలుగొందింది. ఆదివారం ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తో కలిసి స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఎంపి వేమిరెడ్డి మాట్లాడుతూ స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ మహాకుంభాభిషేకంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్వర్ణలింగేశ్వర స్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరగా తీర్చిదిద్దిన దీపా వెంకట్ దంపతుల దాతృత్వాన్ని ఆయన కొని యాడారు. దీపా వెంకట్ దంపతులు, డిప్యూటి మేయర్ రూప్ కుమార్ యాదవ్, టిడిపి నాయకులు కోటంరెడి గిరిధర్ రెడ్డి, ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, బిజెపి సీనియర్ నాయకులు జనార్ధన్ రాజు ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి -గుడ్లూరు

గుడ్లూరులో దోమల నివారణ కోసం ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అధికారులు దోమల నివారణ కోసం మందులు పిసికారి చేశారు గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు వల్ల నీరు నిలవ ఉండిపోవడంతో దోమలు ఉధృతంగా పెరిగాయి. దీంతో జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా దోమల నివారణ కోసం ఫ్యాకింగ్ పిచికారి చేశారు. గుడ్లూరు మెయిన్ బజార్, ఎస్‌సి, ఎస్‌టి, బిసి కాలనీల్లో దోమల నివారణ మందు పిచికారి చేశారు. ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు గ్రామ పంచాయతీ సెక్రెటరీ చంద్రశేఖర్ గ్రామ సర్పంచ్ పాలకుర్తి శంకర్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు బ్యాంకు అకౌంట్లు

ప్రజాశక్తి -గుడ్లూరు : ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిదారులకు వందే నగదు సులభంగా పొందేందుకు ఇండియన్ పోస్టల్ బ్యాంకు అకౌంట్లు తెరిచేందుకు గుడ్లూరులో పోస్టల్ శాఖ అధికారులు ఇంటింటికి తిరిగి ఆదివారం పేర్లు నమోదు చేశారు ఖాతా దారులు దగ్గర రూ. 200 తీసుకొని ఐపి పి.బి అకౌంట్ ఖాతాలు గ్రామం నలుమూలలా తిరిగి నమోదు చేశారు. ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు పోస్టల్ ఉద్యోగులు సుబ్బమ్మ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

గుడ్లూరు రూరల్ : గుడ్లూరు మండలంలోని పూరేటిపల్లిలో ఆదివారం ఈరోజు లబ్ధిదారులకు బ్యాంక్ అకౌంట్ తెరిచేందుకు పోస్టల్ సిబ్బంది ఇంటింటా తిరిగి వివరాలు సేకరించారు. ఇప్పటికే బ్యాంక్ అకౌంట్ ఉన్న వారికి ఆధార్‌తో అకౌంట్ లింక్ చేసే ప్రక్రియ చేపట్టారు.

పూరేటిపల్లిలో..

అవగాహనతో మూర్ఛ నివారణ

ప్రజాశక్తి-నెల్లూరు :సరైన అవగాహనతో మూర్ఛ వ్యాధిని నివారించొచ్చని ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ ఎ వైష్ణవి అన్నారు. మద్రాస్ బస్టాండ్ వద్ద పోనిక్స్ ఆస్పత్రిలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ మూర్ఛ వ్యాధి నివారణ దినోత్సవం (నేషనల్ ఎపిలెప్సి డే) కార్యక్రమం నిర్వహించారు. న్యూరో ఫిజీషియన్ డాక్టర్ ఎ వైష్ణవి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 50 మిలియన్ల మందిని ప్రభావితం చేసే నాడీ సంబంధిత రుగ్మత అయిన మూర్ఛ గురించి అవగాహన కల్పించడానికి ప్రతి ఏడాది నవంబర్ 17న జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని తెలిపారు.పురిటి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆర్.గోకుల్ కష్ణన్, జిల్లా పీ.హెచ్.పీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, చిట్లురి వీరయ్య, ఉప్పలపాటి రామదాసు, భారతి పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ సమావేశం

నెల్లూరు :ఉన్నత పాఠశాలల సమయవేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ చేసిన ప్రతి పాదనల వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇబ్బందులు వస్తాయని, ఆ సమస్యను గుర్తించి పాతపద్ధతిలోనే సమయవేళలు కొనసాగించాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎ.సురేంద్రరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జూమ్ యాప్ ద్వారా జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సబ్ కమిటీ సభ్యులు ఎస్‌కె.ఎం.రియాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. పిచ్చి బాయి మాట్లాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్. వి.క్రిష్ణారెడ్డి, డాక్టరు జుల్ఫికర్ ఆలీ, కె.సుబ్బారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు ఆర్.వెంకటేశ్వర్లురెడ్డి, ఎన్. మురళీకృష్ణ,బాలక్రిష్ణారెడ్డి, సుంకు వెంకటేశ్వర్లు, బాల త్రిపురసుందరి ఉన్నారు.

తలసేమియా డే కేర్ సెంటర్ ప్రారంభోత్సవం చేస్తున్న ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి

రెడ్‌క్రాస్‌కు చేయూత అందిస్తా..

ప్రజాశక్తి-కావలి : రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలకు చేయూత అందిస్తానని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆర్‌డిఒ కార్యాలయ ఆవరణలోని రెడ్‌క్రాస్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన "తలసేమియా డే కేర్ సెంటర్" భవనంను ప్రారంభించి, అక్కడ చికిత్స పొందుతున్న తలసేమియా బాధిత బాలబాలికలను ఆయన పరామర్శించారు. తరువాత ఆధునికరించిన రక్తకేంద్రంను రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఆరుమళ్ళ శ్రీధర్ రెడ్డితో కలసి ప్రారంభించి, అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన యంత్రసామగ్రిని, పరికరాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రముఖ వైద్యులు రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో అయన మాట్లాడారు. తనకు రెడ్‌క్రాస్ అంటే కేవలం రక్తసహాయం చేసే సంస్థగానే తెలుసనీ, కావలి రెడ్‌క్రాస్‌లో 12 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని ఇప్పుడే తెలిసిందన్నారు. 1863వ సంవత్సరంలో హెన్రీ డునాంట్ ప్రారంభించిన రెడ్‌క్రాస్, ఖండాతరాలను దాటి కావలికి చేరి, ప్రజలకు ఎనలేని సేవలు అందించడం విశేషమన్నారు. సంబంధిత మంత్రులతో మాట్లాడి, ప్రభుత్వం నుండి తగు సహాయం అందిస్తానన్నారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఆరుమళ్ళ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తాను జాతీయ పాలకమండలి సభ్యుడిగా కూడా ఉన్నానని, దేశంలో ఎక్కడా కావలి లాంటి చిన్న పట్టణంలో రెడ్‌క్రాస్ కావలి శాఖ అందించే సేవలు లేవన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా శాఖ చైర్మన్, శాసనమండలి సభ్యులు పి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఈరోజు ప్రారంభించిన తలసేమియా డే కేర్ సెంటర్‌కు తమ పూర్తి సహకారం అందిస్తామన్నారు. డాక్టర్.బెజవాడ రవికుమార్, రవిప్రకాష్ లు కావలి రెడ్‌క్రాస్ అందించే సేవలను వివరించారు. అనంతరం కావలి శాసన సభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డిని రెడ్‌క్రాస్ బాధ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ విరాళాలు ఇచ్చిన 28మంది దాతలను శాలువాః జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు కె.హరినారప రెడ్డి, కలికి శ్రీహరిరెడ్డి, స్వర్ణలత, సుధీర్ నాయుడు, ప్రసన్నంజనేయులు, టీం సేవియర్స్, జెవివి, లైఫ్స్ బ్లడ్ వరల్డ్ సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షులు ఖాదర్‌బాషా, జిల్లా రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్, మలిరెడ్డి కోటారెడ్డి, అజయ్ బాబు, ఎ.సాయిరాం, నాయకులు పాల్గొన్నారు.

మంత్రి 'డోల'కు ఎంఎల్ఎ కాకర్ల వినతి

ప్రజాశక్తి-ఉదయగిరి : అధ్వానంగా ఉన్న ప్రభుత్వ హాస్టల్ భవనాలను బాగు చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల వీరాంజనేయులుకు ఎంఎల్ఎ కాకర్ల సురేష్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో ఆరు ప్రభుత్వ హాస్టల్లో ఉన్నాయని వాటిలో సుమారు 342మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. 6 భవనాలకు కూడా కాలం చెల్లి అధ్వానంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయని వాటి స్థానాల్లో కొత్త భవనాలు ఏర్పాటు చేయడంతో పాటు కొన్నిచోట్ల మరమ్మతులు కూడా చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందని ఉరుస్తున్న వర్షం నీరు ఊడుతున్న పెచ్చులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అందుచేత అవసరమైన చోట్ల కొత్త భవనాలు, పై కప్పులు, మరమ్మతులు, ఫ్లోరింగ్, కాంపౌండ్ గోడలు అత్యవసరంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్ఓ వాటర్‌ప్లాంట్‌లను కూడా ఏర్పాటు చేయాలని యుద్ధ ప్రాతిపదికన ఈ బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో మెట్టప్రాంతంలోని హాస్టల్ భవనాలు మరమ్మతులకు రూ.77.92 లక్షలు నిధులు కేటాయించాలని మంత్రికి కాకర్ల సురేష్ వినతి పత్రం అందజేశారు.

కవుల చిత్రపటాలకు పూజలు

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని కొడవలూరు గ్రంథాలయంలో నన్నయ్య, తిక్కన్న, ఎర్రన్న, మొల్ల, కవుల చిత్రపటాలను విద్యార్థిని విద్యార్థులు పూజించారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కవుల గురించి వారు రచించిన గ్రంథాల గురించి విద్యార్థులకు కె.రాజేశ్వరీ తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విడవలూరు : విడవలూరులో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు కవి సమ్మేళనాలు సెమినార్లు, రచయిత సందేశాలు గురించి మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్‌జిఒ శేఖర్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు నాగేశ్వరరావు విచ్చేశారు. అనంతరం పిల్లలకు క్విజ్ ప్రోగ్రామ్ కండక్ట్ చేశారు. తరువాత మ్యూజికల్ చైర్‌ను జరిపారు. తర్వాత స్నాక్స్ పంచడంతో కార్యక్రమం ముగిసింది.

రామ్మూర్తి నాయుడుకు నివాళులు

ప్రజాశక్తి-జలదంకి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు అంత్యక్రియల్లో ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ పాల్గొన్నారు. చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెకు చేరుకున్న ఎంఎల్ఎ, రామ్మూర్తి నాయుడు మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించి నివాళు లర్పించారు. కార్యక్రమంలో నారావారి అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : చంద్రగిరి మాజీ శాసనసభ్యులు నారా రామ్మూర్తి నాయుడు మృతదేహానికి టిడిపి రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరీ మాజీ జెడ్‌పి చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ నివాళులర్పించారు. ఆదివారం చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు రామ్మూర్తి నాయుడుకు పుష్పాంజలితో ఘన నివాళులర్పించి వారి కుటుంబం కు దైవం మనో ధైర్యం కల్పించి వారి కుటుంబానికి అండగా ఉండాలని వారి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ బాబులను కలిశారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : చంద్రగిరి మాజీ శాసనసభ్యులు నారా రామ్మూర్తి నాయుడుకు ఉదయగిరి టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు రామ్మూర్తి నాయుడుకు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బొజ్జ నరసింహులు, నల్లిపోగు నరసింహులు, పెద్ద వెంకటయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, యువ నాయకులు సందాని, శివ, కృష్ణ, జల్సా యాదవ్, తదితర పార్టీ నాయకులు, టిడిపి అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యావసరాలు వితరణ

ప్రజాశక్తి-బిట్రగుంట : కావలివాసులు కాండ్ర సతీష్ ఆదరణ కేంద్రానికి, రూ.20వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులు వితరణగా ఇచ్చారు. గత 3సంవత్సరాల కాలంగా ఇచ్చిన హామీ ప్రకారం క్రమం తప్పకుండా అందజేస్తున్నారు. ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె సింహాద్రి రావు మాట్లాడుతూ సతీష్ అందిస్తున్న సహాయం ప్రశంసనీయమని, సతీష్ ప్రతినెలా 1వ తేదీ తాము అడుగకుండానే సహాయం చేసే వ్యక్తికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. విశ్వనాధరావుపేట హైస్కూల్ రోడ్డు హల్లెలూయ మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ రమేష్ ఆధ్వర్యంలో అన్నం ప్యాకెట్లను అందజేశారు. సతీష్ నాయుడు ఫాలోవర్స్, ఆదరణ కేంద్రం డైరెక్టర్ కట్టిపల్లి సింహాద్రి రావు, భవాని, చర్చి సభ్యులు గంపల దావీదు, సుజన్, హల్లెలూయ మినిస్ట్రీస్ చర్చి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అత్యంత వైభవంగా మహాప్రాకారం, గాలిగోపురం నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమం ఆలయంలో మహాప్రాకారం, గాలిగోపురం నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమా శృంగేరి శారద పీఠ జగద్గురువులు శ్రీ విధుశేఖర భారతీ మహా స్వామి వారు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కావలి ఆర్‌డిఒ, పోలీస్ అధికారులు, మాజీ సోమశిల డైరెక్టర్ కండ్లగుంట మధుబాబు నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, టిడిపి మాజీ ఎంఎల్‌సి బీద రవిచంద్ర, స్థానిక నాయకులు విజయ్ యాదవ్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కీటక జనిత వ్యాధుల భారిన పడేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వ్యాధులకు గురికాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ మాటల్లో ..

ప్రశ్న. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు తమ ఆరోగ్య పరిరక్షణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి. కీటక జనిత వ్యాధుల భారిన పడకుండా ఉండేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలి..?

జవాబు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విధిగా వారంలో ఒక రోజు డ్రై డే కార్యక్రమం చేపట్టాలి. ఇంటి చుట్టుప్రక్కల వర్షపు నీరు నిల్వ ఉంటే వాటిని తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. వాడి వేసిన కొబ్బరి బొండాలు, పనికి రానటువంటి టైర్లలో వర్షపు నీరు నిలిచి ఉండటం వల్ల దోమల సంతతి పెరిగేందుకు అవకాశాలు ఉంటాయి. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను సేవించడం అంత మంచిది కాదు. ప్రస్తుతం నగరంలో వర్షాలు కురుస్తున్నందు వల్ల కాచి చల్లార్చిన నీటిని తాగటం ఆరోగ్యకరం. తాగునీరు కలుషితమైనట్లు అనుమానం వస్తే వాటిని వినియోగించక పోవడం మంచిది. దోమల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి.

ప్రశ్న. సీజనల్ వ్యాధులకు గురికాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. జిల్లాలో డెంగీ వ్యాధితో ఎంత మంది చికిత్సలు తీసుకున్నారు. మరణాలు ఏమైనా సంభవించాయా..?

జవాబు. సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమం నిర్వహించాలని పిలుపు నిచ్చింది. ఈ కార్యక్రమంలో మలేరియా, డెంగీ వ్యాధులను ఏ విధంగా అరికట్టాలి. ఈ వ్యాధులకు గురికాకుండా ఉండేందుకు ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్న అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఈ సదస్సులు ప్రధానంగా తీసుకొని నగర, రూరల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తునాం. బిసి వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్‌కు చెందిన ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాం. ఆశాలు, ఎఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు, సూపర్‌వైజర్ల సహకారంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 2023వ సంవత్సరంలో మలేరియా కేసులు 4నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 3 కేసులు నమోదు అయ్యాయి. 2023లో డెంగీ కేసులు 116 నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 58 కేసులు నమోదయ్యాయి. ఎటువంటి మరణాలు నమోదు కాలేదు.

ప్రశ్న. డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఎన్ని సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు ఎంతమంది నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేశారు..?

జవాబు. డెంగీ కేసుల నిర్ధారణ పరీక్షలు నగరంలోని జిజిహెచ్, కావలి ఏరియా వైద్యశాల, కందుకూరు ప్రభుత్వ వైద్యశాల, ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రభుత్వం సెంటర్లను ఏర్పాటు చేసింది. ఈ సెంటర్లలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించ డంతోపాటు వైద్య చికిత్సలు అందజేస్తారు. జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి ఇప్పటి వరకు 4275మంది నుంచి రక్తనమూనాలు సేకరించి డెంగీ నిర్ధారణ పరీక్షలు చేపట్టాం. వీరిలో కేవలం 58మందికి మాత్రమే నిర్ధారణ అయింది. వీరికి చికిత్సలు అందజేసి పూర్తి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాం. నగరశివారు ప్రాంతాల్లో ఈ డెంగీ కేసులు నమోదు అవుతున్నాయి. ఏయే ప్రాంతాల్లో అయితే ఈ కేసులు నమోదు అవుతున్నాయో ఆయా ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తు న్నాం. జిల్లా వ్యాప్తంగా డెంగీ వ్యాధి నిర్మూల నకు వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తల సమిష్టి సహకారంతో రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నాం. డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదైన ప్రాంతానికి చుట్టుపక్కల ఉన్న నివాసాలల్లో సుమారు 50 రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నాం.

ప్రశ్న. ఈ సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు.. దోమతెరలు ఏయే ప్రాంతాల్లో పంపిణీ చేశారు..?

జవాబు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వారంలో ఒకరోజు తప్పని సరిగా డ్రైడే కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుం టున్నాం. ఇంటింటి సర్వే నిర్వహించడంతో పాటు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం, స్ప్రే కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. గ్రూప్ సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. హైరిస్క్ కలిగిన ప్రాంతాలైన రాపూరు, దోమతెరల పంపిణీ చేశాం. జిల్లాలో ఏయే ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ ఉంటుందో వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవ డంతో పాటు దోమ గుడ్లు, ల్వారాలను నాశనం చేసేందుకు మత్స్యశాఖ అధికారుల సాయంతో గంభూజియా చేపలను వదిలిపెట్టాం.

మాట్లాడుతున్న జెవివి నాయకులు

అంబేద్కర్‌కు నివాళులు

ప్రజాశక్తి-అనంతసాగరం : అనంతసాగరం శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల నాలుగో రోజు రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ లర్పించారు. కవి సమ్మేళనంలో భాగంగా మహాభారతాన్ని తెలుగులోకి అనువదించిన నన్నయ, తిక్కన, ఎర్రన, మహా భాగవతాన్ని రాసిన బమ్మెర పోతన, రామాయణాన్ని రచించిన వాల్మీకి కవయిత్రి మొల్ల తదితర ప్రాచీన, ఆధునిక కవుల గురించి విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు వేమన సుమతి తెలుగు బాల మొదలగు శతక పద్యాలు నుండి పద్య పఠన పోటీలు నిర్వహించారు. వారోత్సవాలలో రేపు మండల కేంద్రంలోని జెడ్.పి.హెచ్.ఎస్, శాంతినికేతన్, వికాస్ హైస్కూల్లో 8వ తరగతి అభ్యసిస్తున్న విద్యార్థులకు అక్టోబర్ వరకు తెలుగు పాఠ్యాంశాల కవి పరిచయం భాషాంశాల వ్యాకరణం అంశాలలో ఖాళీలను భర్తీ చేసే విధానంలో ఉదయం 10:30 గంటలకు పోటీ పరీక్ష నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో జెవివి నాయకులు విశ్రాంత ఉపాధ్యాయులు వేపెంపలయ్య అనంతసాగరం సచివాలయం-1 సంక్షేమ, విద్య అసిస్టెంట్ మురళి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

రైల్వే భూములను వినియోగించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : విజయవాడ డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే భూములను సద్వినియోగం చేసుకోవాలని బోగోలు మండల సిఐటియు కార్యదర్శి బిట్రగుంట రైల్వే ప్రాంతా అభివృద్ధి అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు చల్లా నరహరి పేర్కొన్నారు. బోగోలు మండలం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బోగోలు సిపిఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య, మండల సిఐటియు నాయకులు, బిట్రగుంట రైల్వే ప్రాంతం అభివృద్ధి కమిటీ అధ్యక్షులు చల్ల నరహరి పాల్గొని మాట్లాడారు. బిట్రగుంట రైల్వేపరంగా ఉన్న వందల ఎకరాలు నిరుపయోగంగా ఉన్న భూములను సద్వినియోగం చేసుకొని, ఏదైనా రైల్వే కర్మాగార యూనిట్‌ను ప్రారంభిస్తే బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాల్లో చుట్టు పక్కల ఉన్న నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పించవచ్చని తెలిపారు. ఎన్నికల సమయంలో పార్టీ నాయకులు బిట్రగుంటకు యూనిట్ తెస్తామని మాటలకే పరిమితమయ్యాయి తప్ప ఇంతవరకు ఆచరణలోకి ఏ ప్రభుత్వం తీసుకు రాలేదని, కావలి శాసనసభ్యులు దగ్గుమాటి కృష్ణారెడ్డి బిట్రగుంట రైల్వే అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. బిట్రగుంట రైల్వేపరంగా ఒక యూనిట్‌ను ఇవ్వాలని కోరుతూ సిఎం చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులకు ప్రాంత అభివృద్ధి కోసం కేంద్రంపై పార్లమెంటు సభ్యుల ద్వారా ఒత్తిడి తేవాలని కోరుతూ రిజిస్టర్ పోస్టు ద్వారా అందరికీ పంపించామన్నారు. కార్యక్రమంలో పొట్లూరి శ్రీనివాసులు, నూరుద్దీన్, మండల సిపిఎం నేతలు, తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని 37వ వార్డుకు చెందిన టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షులు పొట్లూరి శ్రీనివాసులు ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమంలో కావలి శాసన సభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. స్వామివారి పడిపూజ మహోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, ప్రజలకు అయ్యప్పస్వామి కృపా కటాక్షాలు తప్పకుండా ఉండాలని ఎంఎల్ఎ కోరుకున్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు

పలుచోట్ల నూతన కమిటీలు ఎన్నిక

వరికుంటపాడులో..

ప్రజాశక్తి-వరికుంటపాడు

వరికుంటపాడు మండల యుటిఎఫ్ సర్వసభ్య సమావేశం వరికుంటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి జి.చలపతి శర్మ మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భావించి 5 దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ 50సంవత్సరాల్లో ఉపాధ్యాయుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశామని తెలిపారు. ఉపాధ్యాయులకు రీ గ్రూపింగ్ స్కేలు సాధించడం, ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేలు, అప్రెంటీస్ సర్వీసు ఎత్తివేయడం, ఆ కాలానికి రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు సాధించడం, ఎస్‌సి ఎస్‌టి ఉపాధ్యాయులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు సాధించడం, మున్సిపల్, సోషల్ వెల్ఫేర్ ఉపాధ్యాయులకు సర్వీసు రూల్సు సాధించటంలో యుటిఎఫ్ పోరాటం అనిర్వచనీయమైన కృషి చేసిందని తెలిపారు. 117 జిఒ రద్దు చేయాలని, 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలలో కొనసాగించాలని కోరారు. అనంతరం యుటిఫ్ ఏర్పాటు నుండి సంఘానికి కృషి చేసిన వారిని, సమావేశానికి బ్యాగులు, ఫైల్స్, భోజనం, పాకెట్ బుక్స్ అందచేసిన దాతలను ఘనంగా సన్మానించారు. భోజన విరామం అనంతరం మండల యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికలలో గౌరవ అధ్యక్షులుగా ఆర్ వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా ఎల్‌వి రమణయ్య, ఉపాధ్యక్షులుగా పి.మనోహర్, ప్రధాన కార్యదర్శిగా వి.వి. సుబ్రహ్మణ్యం జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఆర్.నాగార్జున, కె.చంద్రశేఖర్ రెడ్డి, ఎస్‌కె.కరీముల్లా, కె.హేమలతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉదయగిరిలో...

ప్రజాశక్తి-ఉదయగిరి : 12వ పిఆర్‌సి కమిటీ వేసి, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి వి చలపతి శర్మ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గవర్నమెంట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 50యేళ్ల స్వర్ణోత్సవాల సంబరాల్లో భాగంగా యుటిఎఫ్ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడారు. జిల్లా సీనియర్ నాయకులు ఎన్నికల పరిశీలకులుగా చంద్రశేఖర్ రెడ్డి ఉద్యమ చరిత్రను కొనియాడారు. అలాగే జిల్లా కుటుంబ సంక్షేమ బాధ్యులు నాయబ్ బాషా మాట్లాడుతూ ప్రతి యుటిఎఫ్ సభ్యులు తప్పక ఎస్‌డబ్ల్యుఎఫ్‌లో సభ్యుడిగా చేరాలని పిలుపు నిచ్చారు. అనంతరం ఉదయగిరి మండల శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా షేక్ కరీముల్లా అధ్యక్షులుగా వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఎమ్‌డి హనీఫ్ లను ఎన్నుకున్నారు. చివరగా రాష్ట్రస్థాయి ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన షేక్ సందాని బేగంకు, షేక్.సబియా సుల్తానా బేగంకు జిల్లా అవార్డు అందుకున్న షేక్.ఖాదర్ బాషాకు మండల శాఖ పక్షాన సన్మానించారు. సీనియర్ నాయకులు అంజాద్, గౌస్‌బాషా, ఏడుకొండలు, జాఫర్ సా, రజియా బీ యుటిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

సీతారామపురంలో...

ప్రజాశక్తి-ఉదయగిరి : సీతారామపురం మండల యుటిఎఫ్ నూతన కౌన్సిల్ సమావేశంలో నూతన అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల మహాసభలో సీతారామపురం మండల నూతన కార్యవర్గం ఎన్నికలో మండల యుటిఎఫ్ శాఖ గౌరవ అధ్యక్షులుగా గాజుల రంతూ జానీ, అధ్యక్షులుగా భోగ్యం శ్రీనివాసులు, సహాయ అధ్యక్షులుగా సారే సురేష్, పిఎపి కుమారి, ప్రధాన కార్యదర్శిగా గొడ్లవీటి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఓంకారం నరసింహారాజు, జిల్లా కౌన్సిలర్‌గా డి.వి.ఆర్, పేరాల శ్రీనివాసులు, మహిళా కార్యదర్శి సిహెచ్.పార్వతి, ఎస్‌డబ్ల్యూఫ్ కార్యదర్శి ఎం.మహేష్, ఆడిటర్ ఆనందేశ్వరయ్య, కార్యాలయ కార్యదర్శి షేక్.షబ్బీర్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎడమ తిరుపతయ్య, నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో అభివృద్ధికి నోచని పార్కులు

- పార్కులకు నిధులు మంజూరు చేయని ప్రభుత్వాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పట్టణంలో కుటుంబ మంతా సేదదీరేందుకు ఒక్క పార్కు కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎంతోమంది ప్రజాప్రతినిధులు అమాత్యులుగా పనిచేసిన నియోజకవర్గ కేంద్రమైన ఆత్మకూరులో సేద తీరేందుకు ఒక్కమంచి స్థలం కూడా లేకపోవడం శోచనీయమని పట్టణ ప్రజలు అంటున్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ 2012లో ఏర్పాటైంది. 23 వార్డులు ఉండగా 10వేలకు పైగా గృహాలు ఉన్నాయి. 35వేల జనాభా ఉన్న ఆత్మకూరు పట్టణంలో ఎక్కడా వాకింగ్ చేయడానికి, సేదతీరడానికి కూడా అవకాశం లేదు. సాయంత్రం సమయంలో పిల్లలు, వృద్ధులు, మహిళలు సేద తీరేందుకు స్థలం లేకపోవడంతో ప్రజలు అసహనానికి గురవుతున్నారు.

ఆత్మకూరు మున్సిపాలిటీ ఏర్పడిన అనంతరం 2015లో పట్టణంలోని 12, 13 వార్డుల పరిధిలో సుమారు ఎకరా స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసేందుకు అప్పట్లో ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎస్‌సి ఎస్‌టి సబ్‌ప్లాన్ కింద నిధులు మంజూరు సైతం జరిగాయి. అయితే పార్కు అభివృద్ధి మాత్రం జరగలేదు. కొన్నాళ్లకు అక్కడి ప్రాంత ప్రజలు పార్కు అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, కౌన్సిల్ దృష్టికి తీసుకురావడంతో వారు సైతం ఏకగ్రీవ తీర్మానం చేసి నిధులు మంజూరు చేశారు. ఇది జరిగి 8యేళ్లు గడుస్తున్నా ఇంత వరకు అభివృద్ధి పనులు సాగలేదు. కేటాయించిన నిధులు ఏమయ్యాయో తెలియదు. పట్టణ శివార్లలో ఎసిఎస్ఆర్ కాలనీ సమీపంలో పార్కు ఏర్పాటుకు స్థలం కేటాయించారు. దానిని సుందరీకరణ చేసేందుకు గతంలో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినా అది కూడా కార్యరూపం దాల్చలేదు. దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి ఆత్మకూరు చెరువు వద్ద వాకింగ్ ట్రాక్, పార్కుల ఏర్పాటుకు కృషి చేసినా ఆయన మరణానంతరం ఆ ప్రతిపాదనలన్నీ ఎటో పోయాయో అర్థం కాని పరిస్థితి. టిడ్కో గృహాల వద్ద ఉండే ప్రజల కోసం ప్రతిపాదించిన పార్కు సైతం ఇప్పటి వరకు కార్యరూపంలోకి రాలేదు.

మున్సిపల్ బస్టాండ్ దళితుల ప్రాంతంలో వ్యర్థాలతో పార్క్ స్థలం, వ్యర్థాలతో పార్క్

కూటమి ప్రభుత్వంలోనైనా ఏర్పాటు అయ్యేనా..

గత ప్రభుత్వాల సమయంలో ఆత్మకూరు పట్టణంలో సేద తీరేందుకు ఏర్పాటు చేసిన పార్కుల ప్రతిపాదనలు నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలోనైనా మోక్షం లభిస్తుందా అని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో ఉన్న ప్రతిపాదనలు మున్సిపల్ పాలకవర్గం పట్టించుకోని ప్రస్తుత మంత్రి అభివృద్ధిని పరుగులు పెట్టించే దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దృష్టికి తీసుకెళితే పార్కుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించగలరని పట్టణ ప్రజలు అంటున్నారు. అంతేకాకుండా పట్టణంలో విద్యార్థులకు క్రీడలు నిర్వహించేందుకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తప్ప ఎక్కడా క్రీడలు నిర్వహించేందుకు క్రీడా ప్రాంగణం లేక పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఒక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని ప్రజలు పాలకవర్గాన్ని కోరుకుంటున్నారు.

సభ్యత్వ నమోదులో టిడిపి నాయకులు

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండల కేంద్రంలోని మిక్స్‌డ్ కాలనీలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. పార్టీ ఆదేశాల మేరకు టిడిపి యువ నాయకులు ముప్పాళ్ల వెంకట్‌చౌదరి, మాలపాటి వెంకటేశ్వర్లు గ్రామంలో తిరుగుతూ పండుగలా సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యంగా విద్యావంతులైన యువత మహిళలు ఉత్సహం చూపుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం ఉన్నవారికి పార్టీ రూ.5లక్షలు ప్రమాద బీమాతో పాటుగా ఆ కుటుంబానికి విద్య, వైద్యం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ప్రతి కార్యకర్త సభ్యత్వం పొందాలన్నారు. కార్యక్రమంలో టిడిపి యువనాయకులు ఎస్‌కె నాయబ్, పఠాన్ మస్తాన్, అరికట్ల పుల్లయ్య నాయుడు, టీ నరేష్, కె.ప్రసాద్, తిరుపతి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మూతపడ్డ వాటర్‌ప్లాంట్

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని కృష్ణాపురం గ్రామంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో నిర్మించిన వాటర్ ప్లాంట్ గత మూడునెలల నుండి మూత బడింది. గత ప్రభుత్వ హయాంలో వాలంటీరుగా పనిచేస్తూ వాటర్ ప్లాంట్ బాధ్యతలు చూసుకుంటూ ప్రజలకు శుద్ధి జలాలు అందించేవారు. సాధారణ ఎన్నికలు ముగిసినప్పటి నుండి వాటర్ ప్లాంట్ మూతపడడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు వాటర్‌ప్లాంట్ దగ్గరకు అలవాటు పడే వరకు నెలకు జీతం ఇచ్చైనా వ్యక్తిని నియమించాలని పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి చెప్పారని చూద్దాం.. చేద్దాం.. అంటూ కాలక్షేపం చేస్తూనే బదిలీ అయిపోయారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్‌ను తెరిపించి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి కొడవలూరు : మండలంలోని నార్త్ రాజుపాలెం సెంటర్‌లో వనమా శేషయ్య పద్మావతమ్మ చారిటబుల్ వారి ఆధ్వర్యంలో పేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్య నారాయణ మాట్లాడుతూ 15యేళ్ల నుండి కార్తీకమాసం సందర్భంగా వెనకబడిన పేద బడుగు బలహీన వర్గాల వారికి ప్రతి సంవత్సరం అల్పాహారం అందిస్తూ దుప్పట్ల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డి సతీష్ వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-వరికుంటపాడు : అకస్మాత్తుగా మృతి చెందిన వృద్ధురాలికి మానవత్వంతో ముందుకొచ్చిన మహిళా పోలీస్ మానవతా సంస్థ, జర్నలిస్టులు, విఆర్ఒ, పలువురు నాయకులు అంత్యక్రియలు నిర్వహించి తమ మానవతా దృక్పథాన్ని చాటారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సత్వారిపల్లికి చెందిన కంచు అచ్చమ్మ (64) అనే వృద్ధురాలు కొన్నేళ్లుగా విరువూరులోనే జీవనం సాగిస్తోంది. ఎటువంటి తోడు లేకపోవడంతో గత మూడు నెలులుగా విరువూరు ఎస్‌సి కాలనీలోని సమీపంలో బస్సు సెంటర్లో తలదాచుకుంటుంది. ఇటీవల ఆరోగ్యం బాగాలేక అకస్మాత్తుగా ఆదివారం చనిపోయింది. విషయం తెలుసుకున్న మహిళా పోలీస్ కైరున్ బి, పామురికి చెందిన మానవతా సంస్థ శవయాత్ర వాహనంతో పాటు విలేకరులు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి విలేకర్ పసుపులేటి రఘురాం, ప్రజాశక్తి రిపోర్టర్ గుబిలి ప్రవీణ్, విఆర్ఒ కొండా శ్రీనుతో పాటు గ్రామస్తులతో అంత్యక్రియలు నిర్వహించారు. మానవతా సమస్యకు విషయం తెలియజేయ డంతో శ్మశానానికి తరలించడానికి వాహనాన్ని పంపించారు. వారు మానవత్వం చాటుకోవడంతో స్థానికులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మామిళ్ళపల్లి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ బత్తుల వెంకటరమణ, పందిటి శ్రీనివాసులు, లక్ష్మయ్య, ఇజ్రాయిల్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నివారించాలి

ప్రజాశక్తి-కావలి

సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం మానవాళికి ప్రమాదకరమని లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల వినియోగ నిషేధ చట్టంపై అవగాహన పెంచుకొని ఆరోగ్యంగా ఎదగాలని కోరినారు. సమాజంలో యువత నల్లమందు, గంజాయి, బ్రౌన్ షుగర్, వంటి మత్తు పదార్థాలను సేవించడం వలన యువత నిర్వీర్యం అవు తుందని ఆవేద వ్యక్తం చేశారు. వివేకానందుని బోధనల ప్రకారం ఉక్కు నరాలు ఇనుప కండరాలు కలిగిన ఆరోగ్యవంతమైన యువత ఈ సమాజానికి అవసరమన్నారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల జరిగే దుష్ఫలితాలపై యువతకు అవగాహన పెంచాలని పౌర సమాజాన్ని కోరారు.